



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

సంబరాలకు సర్వం సిద్ధం

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ● నేడు స్వాతంత్ర్య దినోత్సవం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏర్పాట్లను కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ రత్న గురువారం పరిశీలించారు. వేడుకలకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హాజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి సంబంధించి పరేడ్ డయాస్, స్టేజ్ డెకరేషన్, ప్రొటోకాల్ మేరకు సిటింగ్ అరేంజ్‌మెంట్ పక్కాగా చేయాలని ఆర్డీఓ సువర్ణను ఆదేశించారు. శకటాల ప్రదర్శన, కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చే సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అదికారులను కలెక్టరు ఆదేశించారు.

వేడుకల షెడ్యూలు ఇలా...

- జిల్లా ఎస్పీ ఆగమనం 8.55 నిమిషాలకు
- జిల్లా కలెక్టర్ ఆగమనం 8.57
- రాష్ట్ర మంత్రి సవిత రాక 8.58
- జాతీయజెండా ఆవిష్కరణ, పోలీసుదళాల గౌరవ వందనం స్వీకరణ 9.05
- మంత్రి సవిత పరేడ్ సందర్శన 9.10
- మంత్రి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం 9.15
- సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్ 9.35
- ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై శకటాల ప్రదర్శన 10.10
- సాంస్కృతిక కార్యక్రమాలు 10.40
- విశిష్ట సేవలకు ప్రశంసాపత్రాల ప్రదానం 11.10
- ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన 11.55 నిమిషాలు

ఉత్తమ సేవా పురస్కారాలు

పుట్టపర్తి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలందించిన 282 మందిని ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. పుట్టపర్తిలోని శిరాసాని హిల్స్ వద్ద పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించే వేడుకల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అవార్డులు అందజేయనున్నారు. 31 మంది జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో పాటు 251 మంది డివిజన్, మండల స్థాయిలో పలు శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేశారు.

త్రివర్ణ శోభితంగా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముస్తాబయ్యింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఆ కార్యాలయానికి ఓ రోజు ముందుగానే స్వాతంత్ర్య దినోత్సవం వచ్చినట్లైంది.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి టౌన్



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న కలెక్టరేట్

పెనుకొండలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి, టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో పెనుకొండలో పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి వస్తున్న కడప ఇన్‌చార్జి మంత్రి సవితకు పెనుకొండలో ఘన స్వాగతం పలికారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. మంత్రిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేశవయ్య శ్రీనివాసులు, కన్వీనర్లు శ్రీరాములు, ప్రసాద్, త్రివేంద్ర, వెంకటరమణ, నారాయణస్వామి, బాబుల్‌రెడ్డి, సిద్దయ్య, గుట్టూరు సూరి, నాగరాజు, షౌకత్, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, రఘు, ఎగువగడ్డ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భవిష్యత్తు సోలార్‌దే..!

● ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



సోలార్ ప్యానల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో అధికశాతం సోలార్ ప్లాంట్‌లే ఉంటాయని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. మండలంలోని పూలకుంటలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై పెట్టుకున్న సోలార్ ప్యానల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సోలార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల కంటే సోలార్ ఎంతో నయమన్నారు. నియోజకవర్గంలో వచ్చే నాలుగేళ్లలో 10వేల సోలార్‌ప్యానళ్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టేకులోడు గురుకుల పాఠశాల వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ... నందమూరి తారకరామరావు అప్పట్లోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పీఏ వీరయ్య, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, పరిమళ, కన్వీనర్లు ప్రెస్ వెంకటేశ్, రాము, అబీ, శ్రీనివాస్, పూలకుంట సర్పంచ్ మంజునాథ్, నాయకులు నాగరాజు, అనిల్, అరుణాచల్ రెడ్డి పాల్గొన్నారు.

అన్ని చెరువులకు నీరివ్వాలి

నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరివ్వాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకం అధికారులను కోరారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో హెచ్ఎన్ఎస్ఎస్, రెవెన్యూ, అటవీ అధికారులతో సమీక్ష జరిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపాలన్నారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి చిలమత్తూరు, మడకశిర వరకు కాలువలు వెడల్పు చేశాక లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. తరచూ హంద్రీనీవా కాలువగట్లు తెగిపోతున్నాయనీ, అలాంటిచోట రాతి కట్టడంతో భద్రం చేయాలన్నారు. సూరప్పకుంట సుందరీకరణకు సుమారు రూ.25కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా అటవీ అధికారి చక్రపాణి.. ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిధులు తీసుకొస్తానన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

కియ చెంత మట్టి అక్రమ రవాణా

● అడ్డుకున్న అధికారులు



కియ పరిశ్రమ వెనుక ఏపీఐఐసీ భూముల్లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కియ సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో మట్టి అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. కియ పరిశ్రమ వెనకాలే డంప్ చేసిన మట్టిని ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లలో నింపి తరలిస్తుండగా.. ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. పరిసర ప్రాంతాల్లో వెంచర్లు, వేర్ హౌస్‌లకు అవసరమైన మట్టిని తరలిస్తున్నారు. టిప్పరు మట్టి రూ.5వేల నుంచి రూ.6వేల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

సార్..! ధర్మవరం చేనేతలను ఆదుకోండి

● కలెక్టర్‌కు పరిటాల శ్రీరామ్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రాంతంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ గురువారం కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో ఏడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు కాలనీల్లోకి నీరు చేరిందన్నారు. చేనేత కుటుంబాల ఇళ్లలోకి నీరు చేరడంతో మగ్గం గుంతలు మునిగిపోయాయన్నారు. దీంతో చీరల తయారీకి వాడే జరీ, వార్పు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అలాగే నిత్యావసర సరుకులు వాన నీటికి తడిసి పనికిరాకుండా పోయాయన్నారు. ఇందిరమ్మకాలనీ, సత్యసాయి నగర్‌లో ఈపరిస్థితి అధికంగా ఉందన్నారు. ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరుపై హైలెవల్ వంతెనను నిర్మించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ అధికారుల ద్వారా నివేదికలు తెప్పించుకుని, చేనేత కార్మికులకు పరిహారం ఇవ్వడంతోపాటు మద్దిలేరు వాగు హైలెవల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సంధారాఘవ, సుధాకర్, మహేష్‌చౌదరి, పరిశేసుధాకర్ శ్రీశైలం పురుషోత్తం గౌడ్, కొత్తపేట ఆది, విజయసారథి, జింకా పురుషోత్తం, ఆది తదితరులున్నారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలును హర్షిస్తూ కదిరిలో గురువారం ఐదువందల ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమం ఇంటింటికీ చేరుతోందని అన్నారు. అభివృద్ధి అన్ని ప్రాంతల్లోనూ పరుగులు తీస్తోందని అన్నారు. ఐదు సంవత్సరాల జగన్ చెత్త పరిపాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీ కూటమికి నీరాజనం పలికారని అన్నారు. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుకోకుండా ఆ ప్రాంతానికి వాహనంలో వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, 'మా పెద్దయాన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నదాత సుఖీభవ ర్యాలీకి వచ్చిన రైతులను చూడాలి.. కనువిందు చేసే ఈ దృశ్యాలను చూడాలి..' అని అన్నారు. వాహనాలకు, రైతులకు డబ్బులు ఇవ్వకున్నా స్వచ్ఛందంగా వచ్చి చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఒక్క పిలుపుతో ఇంతమంది తరలి వచ్చారంటే.. అది చంద్రబాబు పాలపై ప్రజలకు ఉన్న నమ్మకం అని అన్నారు. కరువు సీమలో కృష్ణా జలాలు పరుగులెత్తిస్తున్నారని అన్నారు. తలుపుల మండలంలోని కొండారెడ్డి చెరువుకూడా నీరు చేరిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్‌రెడ్డి, మైనార్టీ నాయకురాలు పర్వీనా బాను, నాయకులు బాహుద్దీన్, రాజశేఖర్‌బాబు, మనోహర్ నాయుడు, రాజారెడ్డి, తదితరులు మాట్లాడారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

మరక మంచిదేనా..?

● అవినీతి మరకలున్న వారికీ ఉత్తమ అధికారులుగా అవార్డులు
● ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
● ఎంపిక తీరుపై ఆయా శాఖల్లోనే విమర్శలు (8లో)

రైట్.. రైట్..

● 'స్త్రీ శక్తి'కి శ్రీకారం నేడే
● ఉచిత బస్సు ప్రయాణం అమలుకు ఆర్టీసీ సన్నద్ధం
● మహిళల్లో హర్షాతిరేకాలు (8లో)



అర్బన్‌లో జగడం

● ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర ఆరోపణలు ● అభివృద్ధి, అవినీతి అంశాలపై ఘాటు విమర్శలు (8లో..)



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

టీడీపీ సంబరాలు

కడపలో గెలుపుపై అనంతలో ఆనందోత్సాహాలు

అనంతపురం క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై అనంతపురంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. గురువారం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలుగా టీడీపీ అభ్యర్థులు గెలవడంతో అనంతపురం నగరంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. జడ్పీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత టీడీపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... 40 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రాంతంలో ప్రజాస్వామ్యం కనిపించిందన్నారు. వైనాట్ పులివెందుల అన్నామనీ, ఇప్పుడు గెలిచి చూపించామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేస్తే.. ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలోనే కాకుండా కడప జిల్లా అంతటా టీడీపీ జెండా రెపరెపలాడుతోందన్నారు.

ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో...



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందనీ, ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాల నియంతృత్వ పోకడలు అమలు చేసిన ఫ్యాక్షన్ చరిత్ర వైఎస్ కుటుంబానిదన్నారు. జగన్ రెడ్డి నేతృత్వంలో ప్రజలను బానిసల్లా చూశారన్నారు. 40 ఏళ్ల అక్కడ ఇదే జరిగిందని, ఈ ఎన్నికల్లో అక్కడ ప్రజలు స్వేచ్ఛగా తమకు నచ్చిన వ్యక్తులకు ఓటు వేశారన్నారు.

నష్టం వివరాలు తెలుసుకోండి: మంత్రి



కార్మికులతో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ, కమిషనర్

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధర్మవరంలో చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించారు. నష్టపోయిన చేనేత కార్మికులను గుర్తించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేశ్‌బాబు, హ్యాండ్‌లూమ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ అధికారులు గురువారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, దుర్గానగర్, ఎల్-3 కాలనీలో పర్యటించి మగ్గం గుంతల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. నష్టం వివరాలపై అక్కడి నేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటామని అధికారులు భరోసా ఇచ్చారు. నష్టపోయిన వారందరికీ ఆర్థికసాయం, సబ్సిడీల రూపంలో తక్షణ సాయం అందించేలా చర్యలుతీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోండి

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్‌పీసీఐ లింక్‌లేని రైతులు ఈనెల 20లోపు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో ఈనెల 2న 2,65,040మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయన్నారు. ఇప్పటికి ఎన్‌పీసీఐ లేని రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నీటి పంపులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.3వేల కోట్లు కేటాయించి, విస్తరణ పనులు చేపట్టడాన్ని హర్షిస్తున్నామన్నారు. హంద్రీనీవా కాలువకు 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారన్నారు. 30ఏళ్లు కావస్తున్నా, నేటికీ పిల్లకాలువ నిర్మాణాలు జరగక పోవడంవల్ల రైతులకు సాగు నీరు అందడం లేదన్నారు. రాయలసీమలోని గాలేరు, నగరి, వెలిగోడు ప్రాజెక్టులు కూడా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, వేల కోట్ల రూపాయలతో పోలవరం, బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వడం కాంట్రాక్టుల కోసమేనని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పూర్తి చేసిన తర్వాతనే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిధులు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, సుల్తాన్, సంగప్ప పాల్గొన్నారు.

మరక మంచిదేనా..?

- అవినీతి మరకలున్న వారికీ ఉత్తమ అధికారులుగా అవార్డులు
- ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
- ఎంపిక తీరుపై ఆయా శాఖల్లోనే విమర్శలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా అందించే ఉత్తమ సేవకుల పురస్కారాల్లో అవినీతి మరకలున్న వారి పేర్లు కూడా ఉంటుండటం విమర్శలకు తావిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పని తీరు కనబరిచిన కొందరు అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేశారు. అయితే ఇవి అక్రమార్కులు, అవినీతిపరులకు ఇస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



పుష్కలమైన అవినీతి

ఏదో ఒక పనిచేసి పెడితే పైసలు పుచ్చుకునే అధికారులు కాదు వారు. ఈ పని చేస్తే ఇంత ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసి మరీ పుచ్చుకుంటారు. అలాంటి అధికారులకు గతంలో ఉత్తమ అధికారులంటూ అవార్డులు అందజేశారు. ఇక ఏసీబీ అధికారుల తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయిన అధికారులు, సస్పెండైన అధికారులకు సైతం అవార్డులు దక్కాయంటే నోరెళ్లబెట్టక తప్పదు. ఉదాహరణకు...

- అనంతపురం నగరపాలక పరిధిలో తాగునీటి సరఫరా విభాగంతో పాటు సివిల్ వర్క్స్ పర్యవేక్షించిన ఓ డీఈ అవినీతికి అంతే లేదు. కమీషన్లతో పాటు బినామీ కాంట్రాక్టర్లతో దొంగ బిల్లులు చేయించిన ఘనత ఈయనది. గత ఏడాది ఈయనగారికి ఉత్తమ అధికారి అంటూ అవార్డు ఇచ్చారు మరి.
- కళ్యాణదుర్గం పంచాయతీరాజ్ శాఖలో గత ఏడాది డీఈగా పనిచేసిన ఓ ఇంజనీర్ అవినీతిలో బాగా ఆరితేరిపోయారు. ఆయన విధులకు ఎప్పుడొస్తారో తెలియదు. సెలవులోనే ఎక్కువగా ఉండేవారు. బళ్లారిలో బిల్లులు, కమీషన్ల వ్యవహారాలు నడిపే ఈయన అక్కడే రూ.కోట్లు వెచ్చించి కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నారట. ఈయనకూ గత ఏడాది అవార్డు ఇచ్చేశారు.
- మూడేళ్ల కిందట ఓ అధికారి పేరు చూసి ఆ శాఖ వర్గాలు నివ్వెరపోయాయి. అనంతపురం పరిధిలో ఆర్ఐగా సస్పెండ్ అయి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన ఓ అధికారికి అవార్డు దక్కింది.
- పోలీస్ శాఖలోనూ గత రెండేళ్లలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, మరో ఆరుగురు ఎస్ఐలకు అవార్డులు దక్కాయి. పంచాయతీలు, సెటిల్మెంట్‌లలో వీరు బాగానే వెనుకేసుకున్నారనే ఆరోపణలున్నాయి.



అనంతపురం కలెక్టర్ కార్యాలయం

- ఇక రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలలో 70 శాతం మంది అవినీతి మరకలున్న అధికారులే. వీరిలో కొందరు ఇప్పటివరకు ఐదారుసార్లు అవార్డు పొందడం గమనార్హం.
- గతంలో ఆర్డీఓలు, డీఎస్పీలు...ఈ పోస్టుంటే చాలు వారు అవినీతి మరకలున్నా అవార్డులు అందజేశారు. కేవలం ఆ హోదాను చూసి ఇచ్చారనే విమర్శలొచ్చాయి.

జంబో జాబితా...

అవార్డుల జాబితా చూస్తే జిల్లాలో నిజాయతీ, ప్రజా సేవలో తపించే అధికారులు ఇంత మంది ఉన్నారా ప్రజలు సైతం ఆశ్చర్యపోయేలా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇంత మంది నిజాయతీ అధికారులు ఉంటే ప్రజల సమస్యలు త్వరగా ఎందుకు పరిష్కారం కావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఉత్తమ అధికారుల జాబితా చాంతాడంత ఉంటోంది. గతంలో 400మందికి పైగా ఉత్తమ అధికారులను ఎంపిక చేశారు. ఈ సారి 400 పైచిలుకే జాబితా తయారైంది. ఆయా శాఖలో అవినీతికి పాల్పడుతున్నారని తెలిసినా వారి పేర్లు అవార్డు జాబితాలో చేరుతోంది. కొందరు అధికారులు తమ శాఖల్లో ఉన్నతాధికారులకు అనుకూలంగా వ్యవహరించి జాబితాలో తమ పేరుండేలా చేసుకుంటున్నారు. అలాగే తమపై అవినీతిమరక పోగొట్టుకోవడానికి ఇలా చేయించారనే ఆరోపణలున్నాయి.

ఈ సారైనా...

ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ముస్సోరీలో శిక్షణ నిమిత్తం సెలవులో ఉన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్నారు. ఈయన నిబంధనల విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఈ సారి విడుదలయ్యే అవార్డు జాబితాలో అవినీతిని తగ్గిస్తారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 400 మందికి పైగా ఉండే అధికారుల జాబితాలో అవినీతి మరకలున్న అధికారులెందరో చూడాలి.

పరిశీలిస్తా



గతంలో అవినీతి అధికారులకు అవార్డులు వచ్చిన విషయం నాకు తెలియదు. ప్రతి శాఖ నుంచి అధికారుల జాబితా పంపుతారు. ఉత్తమ అధికారుల జాబితా పరిశీలించి, అర్హులకే అందజేస్తా.

- శివనారాయణశర్మ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్

వర్ష సూచన

బుక్కరాయసముద్రం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి, మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 28.5-30.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠంగా 22.4-23.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 12-14 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. గాలిలో తేమ ఉదయం పూట 74-79, మధ్యాహ్నం 50-60 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

అనంతపురం జిల్లాలో 15న 8మి.మీ, 16న 2.5 మి.మీ, 17న 4.2 మి.మీ, 1.8న 7 మి.మీ, 19న 7.5మి.మీ, కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 15న 8మి.మీ, 16న 2.5 మి.మీ, 17న 2.9 మి.మీ, 1.8న 2.5 మి.మీ, 19న 3 మి.మీ, కురిసే అవకాశం ఉందన్నారు.

వాతావరణ సలహాలు

ఉమ్మడి జిల్లాలో వర్షాధారం కింద ఉన్న ఎర్ర నేలలో వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, అనుములు, పెసర పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అధిక వర్షం కురిసనపుడు నీరు పోయేలా పొలాల్లో కాలువ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆర్ఎస్‌కేలో ఫిర్యాదు చేయండి

కొత్తచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు జమ కానీ రైతులు ఈనెల 20లోగా వారి వారి గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో అర్జీలు అందించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 625 మంది రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోగా 327 మంది రికార్డులు అనుమతించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే రైతుసేవా కేంద్రాలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అందజేసి ఫిర్యాదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అర్బన్‌లో జగడం

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర ఆరోపణలు
- అభివృద్ధి, అవినీతి అంశాలపై ఘాటు విమర్శలు

అనంతపురం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర విమర్శలకు దిగారు. అభివృద్ధి, అవినీతి అంశాలపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. సాయినగర్‌లోని ఓ ఆస్పత్రి వివాదంతో మొదలై.. పాత విషయాలను తవ్వుకునేదాకా వెళ్లింది. తనపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు చేయడం వెనుక మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఉన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరోపించారు. కాగా, రామకృష్ణ మంచి భావాలు ఉన్న వ్యక్తి అని, ఆయనతో తాను మాట్లాడితే తప్పేమిటని ప్రభాకర్ చౌదరి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరు నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్నారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే, రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు.

నాకు రాజకీయం తెలియదు...



"రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు అభివృద్ధి తప్ప రాజకీయాలు చేయడం తెలియదు. సీఎం చంద్రబాబు ఆశీర్వాదం, మా యువనేత లోకేశ్ సహకారంతో ఎమ్మెల్యే అయ్యాను. నేను వచ్చినప్పటి నుంచి కుట్రలు చేస్తున్నారు. మళ్లీ నాకే ఎక్కడ టిక్కెట్ ఇస్తారేనన్న భయంతో పార్టీ లైన్‌లో ఉన్న మరో నాయకుడు బురద చల్లుతున్నారు. ఎంతటి సీనియర్లు అయినా క్రమశిక్షణ తప్పితే చర్యలు ఖాయం. నేను తప్పుచేయను. చేస్తే తలవంచుతాను. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం. నగరంలో ఏడాది కాలంలో రూ.122 కోట్లతో అభివృద్ధి చేశాను. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం డీపీఆర్ పంపాము. 30 ఏళ్ల డంపింగ్ యార్డ్ సమస్యను క్లియర్ చేయిస్తున్నాము. మూడు వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాము. సీపీఐ రామకృష్ణ నాకు బాగా తెలుసు. ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివినట్లున్నారు. ఎమ్మెల్యే అయ్యాక బంధువుల పేరిట, నా పేరిట సెంటు భూమి కొనలేదు. గతంలో సుగుణ చికెన్ దుకాణాల్లో వసూళ్లు అంటూ యల్లనూరు, పుట్లూరు వ్యక్తుల పేరుతో వాయిస్‌లు బయటకొచ్చాయి. ఆ ప్రాంతంలో ఎవరికి బాగా పరిచయాలు ఉన్నాయో అందరికీ తెలుసు. అస్త్ర ఆసుపత్రి ఘటనపై రాంనగర్‌లో ఉండే శ్రీనివాస్ చౌదరి కొందరు మీడియా వాళ్లను జడ్పీలోకి తీసుకెళ్లి బలవంతంగా మా వాళ్ల పేర్లు చెప్పించే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్‌ను విచారించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కోరాము. భూ కబ్జాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. నా వద్దే వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నా బావమరిది అశోక్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. గతంలో రహంతుల్లా, మహాలక్ష్మి శ్రీనివాస్ ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. ఇలాంటి రాజకీయాలు చేయడం నాకు తెలియదు. ఆ నాయకుడి అనుభవమంత వయస్సు కూడా నాకు లేదు. మంచి కోసం ఆయన సలహాలు ఇస్తే తీసుకుంటాను. 14 నెలలుగా నాపై కుట్రలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారు. ఇలాంటి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారు.." - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

దగ్గుపాటీ.. తేల్చుకుందాం రా..



"దగ్గుపాటీ.. నోరు అదుపులో పెట్టుకో. దమ్ము ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. పోటీ చేద్దాం. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూద్దాం. సమాధులను ఆక్రమించిన వాళ్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లు కూడా నన్ను పార్టీ నుంచీ సస్పెండ్ చేయాలని అడిగారని తెలిసింది. నువ్వు అర్ధరాత్రి టిక్కెట్ తెచ్చుకున్నా నేను కలిసి తిరిగాను. చంద్రబాబు సీఎం కావాలని కష్టపడ్డాను. నీ కోసం కాదు. ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి అవాకులు, చవాకులు పేలుతున్నావు. కష్టపడినోళ్లపై బురద చల్లుతావా? మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నేను అక్రమంగా ఆస్తులు సంపాయించానని అంటున్నావు. రా చర్చ పెట్టుకుందాం. నాకు ఎక్కడ అక్రమాస్తులు ఉన్నాయో లెటర్ ప్యాడ్‌పై రాసివ్వు. పార్టీ కోసం శ్రమించిన వాళ్లనే స్టేషన్లలో పోలీసుల చేత చితకబాదించింది నిజం కాదా? నీ దుర్నీతిపై ఆధారాలున్నా పార్టీ కోసం మౌనంగా ఉన్నాను. నా ఇంటిని బుల్డోజర్‌తో కొట్టిస్తానంటావా..? నేను తాలిబొట్లు తెంచానంటావా..? రాప్తాడు మర్డర్ కేసులో ముద్దాయి ఎవరు? సీపీఐ రామకృష్ణ మంచి భావాలున్న వ్యక్తి. ఆయనతో నేను మాట్లాడితే తప్పేంటి..? రాత్రి మందు తాగి మాట్లాడే వారెవరో అందరికీ తెలుసు.."

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అయ్యో.. దేవుడా..!

- లారీ ఢీకొని గుంతకల్లులో బాలిక దుర్మరణం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



ప్రమాదంలో కుమార్తెను చూసి రోదిస్తున్న తల్లి, షేక్ అఫ్రీన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఎనిమిదేళ్లకు పుట్టిన ఆ పాపను తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. విద్యా బుద్ధులతో పాటు, ఆధ్యాత్మిక చింతన, దైవభక్తిని నేర్పిస్తున్నారు. ఈక్రమంలో ఆ చిన్నారి వారం కిందట ఖురాన్ పుస్తక పఠనం పూర్తి చేసింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో నానమ్మ ఇంటికి వెళ్తానని తండ్రిని ఒప్పించి తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. మార్గమధ్యంలో లారీ మృత్యువు రూపంలో ఢీ కొనడంతో ఆ పాప దుర్మరణం చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని విద్యానగర్-1లో నివాసముంటున్న షేక్ ఖాదర్ వలి, హాసినా బేగం దంపతుల కుమార్తె షేక్ అఫ్రీన్(12) పీఅండ్‌టీ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. షేక్ ఖాదర్‌వలి రైల్వే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు రావడంతో మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద నివాసముంటున్న నాయనమ్మ ఇంటికి వెళ్తనని తండ్రిని షేక్ అఫ్రీన్ అడిగింది. ఆయన అంగీకరించడంతో స్కూలుకు సెలవు పెట్టి తల్లితో కలిసి గురువారం మధ్యాహ్నమే బయల్దేరింది. గుత్తి రోడ్డులోని బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద వీరు వెళ్తున్న స్కూటీని బళ్లారి నుంచి గుత్తికి వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. స్కూటీలో వెనుక కూర్చున్న షేక్ అఫ్రీన్ కింద పడటంతో ఆమె మీదుగా లారీ వెళ్లింది. దీంతో శరీరం నుజ్జునుజ్జు అయ్యి బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి హాసినా బేగం స్వల్పంగా గాయపడింది. కళ్లెదుటే ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. కుమార్తె మరణవార్తతో తండ్రి కుప్పకూలిపోయాడు. లారీ డ్రైవర్ పారిపోతుండగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జ్వరంతో విద్యార్థిని మృతి




చైత్ర లలన (ఫైల్)

యాడికి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతూ ఏడో తరగతి విద్యార్థిని చైత్ర లలన (12) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికి గ్రామానికి చెందిన వడ్డి జయరాం, లక్ష్మీప్రియ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె చైత్రలలన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి పరీక్ష రాసి వచ్చింది. జ్వరం వస్తుండటంతో బుధవారం ఇంటివద్దనే ఉన్నట్లు తెలిపారు. ఈక్రమంలో వాంతులు, విరోచనాలతో బాలిక పరిస్థితి సీరియస్ కావడంతో బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్ల మని చెప్పారు. అక్కడకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు తెలిపారు. బహుశా కార్డియాక్ అరెస్ట్ జరిగి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు.

రైట్.. రైట్..

- 'స్త్రీ శక్తి'కి శ్రీకారం నేడే
- ఉచిత బస్సు ప్రయాణం అమలుకు అనంత ఆర్టీసీ సన్నద్ధం
- మహిళల్లో హర్షాతిరేకాలు





అనంతపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదురుచూసిన వేళ రానే వచ్చింది. ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తికి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. సాయంత్రం 5 గంటల నుంచి పథకాన్ని అమలు చేసేందుకు అనంత ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనుమతించనున్నారు. ఆ మేరకు మహిళలు నిర్దేశించిన బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణ వసతి పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉచిత ప్రయాణ పథకం ఎంతోమంది మహిళలకు ప్రయోజనకరంగా మారనుంది. బాలికలు మొదలుకుని వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు సైతం వయోపరిమితి లేకుండా స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణ వసతి కలగనుంది. రోజూ ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లొచ్చేవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు సైతం చార్జీల భారం తప్పనుంది. ఓటరు కార్డుగానీ, ఆధార్ కార్డుగానీ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో పురుషులు 60శాతం, మహిళలు 40 శాతం ఉంటోంది. శుక్రవారం నుంచి అమలయ్యే పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉండొచ్చని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

అనంత ఆర్టీసీ సన్నద్ధం

స్త్రీ శక్తి పథకం అమలుకు అనంతపురం రీజియన్ ఆర్టీసీ అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటి నుంచే పథకం అమలుకు సంబంధించిన చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు. స్త్రీ శక్తి పథకానికి వినియోగించే పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కండిషన్‌ను పరిశీలించడంతోపాటు లైట్లు, టైర్లు అవసరమైన వాటికి ఏర్పాటు చేయించారు. బస్సుల్లో మహిళలకు టిక్కెట్ జారీ చేసే విధానంపైనా డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ కల్పించారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాన్ని ప్రారంభించిన తరువాత అనంతపురం డిపోలో ఇక్కడి ప్రజాప్రతినిధులచే పథకాన్ని ప్రారంభింపజేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అన్నిరకాల చర్యలు చేపట్టాం...



స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను కండిషన్‌లో ఉంచడంతోపాటు సిబ్బందికి అవగాహన కల్పించాం. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వర్తించేలా సూచించాం. పథకం ప్రారంభమయ్యాక మహిళా ప్రయాణికుల రద్దీ పెరగడంతోపాటు బస్సుల్లో గందరగోళం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పథకం గురించి మహిళలకు అవగాహన కలిగేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

- నాగభూపాల్, ఆర్టీసీ అనంతపురం డీఎం

మహిళలకు ఆర్థిక చేయూత...



స్త్రీ శక్తి పథకం అమలుతో రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కలిగింది. తద్వారా చార్జీల భారం తగ్గి మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందనడానికి సూపర్ సిక్స్ అమలు చేస్తుండడమే నిదర్శనం.

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

న్యూస్ బాక్స్

స్వాతంత్ర్య దినోత్సవాలకు ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో ఎంపీడీఓ కార్యాలయం

ధర్మవరం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యదినోత్సవాలకు మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. ఎంపీడీఓ కార్యాలయానికి జెండా రంగుల విద్యుత్ దీపాలు వేయించడంతో జెండా పండుగ శోభ సంతరించుకుంది. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం, వెలుగు తదితర కార్యాలయాలన్నీ ముస్తాబు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'విద్యార్థి దశలో సామాజిక, కుటుంబ విలువలు' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి సంస్థ సెక్రటరీ కోనాపురం సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, డైరెక్టర్ గాజుల సోమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జున మెమెంటోలు అందజేశారు.

ఉత్తమ అవార్డుకు ఎంపికైన హెడ్‌కానిస్టేబుల్



గాండ్లపెంట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలపోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామమోహన్ ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైనట్లు మండల పోలీసులు గురువారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంత్రి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

'డబ్బులు ఇస్తేనే పనిచేస్తారంట'

కొత్తచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు డబ్బులు ఇస్తేనే పనిచేస్తారని లేకపోతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పదో వార్డు సభ్యుడు అప్పకొండప్పగారి రవి ఆరోపించారు. ఆయన గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... స్థానిక బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని ఏఈకి విన్నవించగా, ఆయన విద్యుత్ స్తంభాలను తెప్పించార న్నారు. అయితే వాటిని ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు కిందిస్థాయి ఉద్యోగులను కోరినా పెడచెవిన పెడుతున్నారన్నారు. కొందరు ఉద్యోగుల తీరుపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్ఈ, డీఈకి ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



పుట్టపర్తిలో బాణసంచా కాలుస్తున్న తెలుగు తమ్ముళ్లు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కడపజిల్లా పులివెందుల, ఒంటి మిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంపై తెలుగుతమ్ముళ్ల సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని హనుమాన్ కూడలిలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణాసంచాకాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యులు చెన్నకేశవులు, నాయకులు అమ్మినేని కేశవనాయుడు, భీమినేని కిష్టప్ప, సునీల్, టీఎన్ఎస్ఎఫ్ రామాంజినేయులు, వీసీ గంగన్న, పాపారెడ్డి, పీట్ల రమణ, కేశప్ప, నారాయణ, నరసింహులు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



● బుక్కపట్నం: మండలకేంద్రంలోని తేరుకూడలిలో గురువారం భారీగా బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



నల్లమాడలో...

● నల్లమాడ: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, శివప్రసాద్‌రెడ్డి, నాగేనాయక్, రషీద్‌ఖాన్, పూల రామయ్య, పుట్ల రవీంద్ర, చెన్నారెడ్డి, బాలిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కొండకమర్లలో...

● ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకరమర్ల గ్రామంలో తెలుగు తమ్ముళ్లు మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఎంపీ జాకీర్, మాజీ ఎంపీటీసీ బడిశం రామాంజనేయులు, గంగాద్రి, వీరేనాయక్, సురేష్, ఇర్షాన్, రమణ, సంగాల శీనా, ఎఫ్ఎ రామాంజి, షమూన్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కొక్కంటి క్రాస్‌లో...

● తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో తెలుగు తమ్ముళ్లు గురవారం సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సోంపాల్యం నాగభూషణ్, నాయకులు వెంకటరమణ, శంకరప్ప, నరసింహులు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, పులి మహేష్, షబ్బీర్, క్రిష్టానాయక్, చంద్రారెడ్డి, సూరి, నాగభూషణం, రాములు, రామాంజనేయులు, సాంబ, రంజిత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కాలనీలు

● రోడ్లపై మురుగు, వర్షపు నీటి నిల్వలు
● దుర్వాసన, దోమలతో ప్రజలకు ఇబ్బందులు



విజయలక్ష్మీ కాలనీలో ఇంటి ఎదుట నిలిచిన మురుగునీరు

నల్లచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలోని పలు కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు అస్తవ్యస్తంగా రోడ్లపైనే పారుతోంది. దీంతో కాలనీల్లోని వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలకేంద్రంలోని విజయలక్ష్మీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, నూరుద్దీన్ కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఆయా కాలనీల్లో అధికారులు తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారని, కార్మికులు కూడా చెత్త తొలగించడంలేదని కాల నీవాసులు వాపోతున్నారు. కాలువల్లో చెత్త పేరుకు పోయి రోడ్లపై మురుగు పారుతోంది. కొన్ని కాలనీల్లో మురుగునీటి కాలువలు లేవు.

ఆయా కాలనీల్లో ఇలా....

నూరుద్దీన్ కాలనీలో మురుగునీటి కాలువలో చెత్తచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగు నీరు రోడ్డుపై పారుతుండడంతో దుర్వాసన వస్తోంది. అలాగే వర్షాలు కురిసినప్పుడు కరెంటు ఉండకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. విజయలక్ష్మి కాలనీలో మురుగు కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో మురుగునీరు రోడ్డుపైన, ఇళ్లమధ్యలో వెళ్తుం డడంతో దుర్వాసన వస్తోంది. వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు మురుగునీటితో చేరి రోడ్లపై పారుతోంది. కాలనీ చివరిలో మురుగునీటి కాలు వ వద్ద చెత్తచెదారంతో పాటు కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో మురు గు ముందుకు కదలడంలేదు. మురుగు నిలువ ఉండడంతో విషజ్వరాల బారిన పడాల్సి వస్తోందని ఆ కాలనీ వాసులు ఆందోళన చెందుతు న్నారు. అధికారులకు సమస్యలు చెప్పినా, అప్పడు మాత్రం వచ్చి ఒక వీధిలో మాత్రంలో పారిశుధ్య పనులుచేసి, కాలనీలో నిలువ ఉన్న చెత్తచెదారం తొలగించడంలేదని మండిపడుతున్నారు. మురుగునీరు నిలువ ఉండడంతో పక్కనే ఉన్న జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రహరీ కూలిపోయింది. దీంతో విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నట్లు వాపోతున్నారు. పగటిపూత దోమలు స్వైరవిహారం చేస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. దుర్వాసన భరించలేక ఆప్రాంత వాసులు భోజనం తయారుచేసుకుని, మరో వీధిలో బంధువులు, ఇళ్లలో భోజనం చేస్తున్నట్లు ఆవేదన చెందారు. ఇంత దుర్వాసన వస్తుంటే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్య తీవ్రతను గురించి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు. అదేవిధంగా చిరు జల్లులు పడినా అంబేడ్కర్ కాలనీ జలమయం అవుతుంది. నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కాలనీలో నీరు నిలువ ఉంది. దీంతో వృద్ధులు, చిన్నారులు రోడ్లపై నడవడానికి వీలు లేకుండా పోతుందని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్నిచోట్ల మురుగునీటి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు, వర్షపు నీరు నిలువ ఉంది. దీంతో దోమలు వృద్ధి చెందాయని, దీంతో చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడితే రూ.15వేలనుంచి 20వేలదాకా ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము కూలి చేసుకుని బతికేవాళ్లమని, అంత ఆర్థిక స్థోమత లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం



కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీటి దుర్వాసన ఇళ్లలోకి వస్తోంది. అన్నం కూడా తినలేకపోతున్నాం. దుర్వాసన ఎక్కువగా ఉండడంతో వేరే వీధుల్లో ఉన్న బంధువుల ఇళ్లలోకి వెళ్లి తినాల్సి వస్తోంది. రోడ్డుకు అటువైపున ఉన్న హోటల్, మాంసం దుకాణాల నుంచి వ్యర్థపదార్థాలు కాలువల్లో పడేస్తుండడంతో దుర్వాసన ఎక్కువగా ఉంది. ఇలాంటి వ్యర్థాలను కాలువల పడేకుండా అధికారులు చర్యలు తీసుకుంటే కొంతవరకు దుర్వాసన తగ్గుతుంది. అలాగే మురుగునీరు నిలువ లేకుండా చూడాలి. -నిర్మల, విజయలక్ష్మి కాలనీ

సమస్యలను పరిష్కరిస్తాం



నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగునీటి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు చెత్తను శుభ్రం చేస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. విజయలక్ష్మీకాలనీలోని మేజర్ సమస్యను మూడురోజుల్లో పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

-నరేష్, పంచాయతీ కార్యదర్శి

సరోజమ్మ కుటుంబానికి చేయూత



సరోజమ్మ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లికి చెందిన సరోజమ్మ కుమారుడు రమేష్ స్థితిపై ఆంధ్రజ్యోతిలో కథన ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన స్త్రీశక్తి మహిళ పరిష్కార వేదిక జిల్లా అధ్యక్షురాలు గంగాదేవి స్పందించారు. ఆమె గురువారం సరోజమ్మ ఇంటిని సందర్శించి, తక్షణ సాయంగా నిత్యవసర వస్తువులతో పాటు దుస్తులు, దుప్పట్లు అందించారు. తమవంతుగా కుటుంబానికి తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమెతో పాటు కదిరి రీజనల్ ఎస్‌టీఎస్ రవి, జీఓ గీత, టీడీపీ మండల మాజీ కన్వీనర్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు

ధర్మవరం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు నుంచి బడన్నపల్లి కి వెళ్లే రహదారిని కప్పేసిన కంపచెట్లను తొలగించారు. గొట్లూరు - బడన్నపల్లి రహదారికి ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై ఈనెల 10న 'రోడ్డును కప్పేసిన కంపచెట్లు' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనంపై స్పందించిన ఎంపీడీఓ సాయిమనోహర్, సర్పంచ్ పిట్టా నరసమ్మ, పంచా గణేష్‌లు స్పందించారు. దీంతో గురువారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

జోరుగా వర్షం

ధర్మవరం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా అల్పపీడనంతో ఎడ తెరపిలేకుండా నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. గురువారమూ కురిసింది. దీంతో గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి పలు గ్రామాల్లో వాగులు, వంకలు పారుతున్నాయి. రైతులు వరినాట్లలో ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాడుబడిన ఇళ్లల్లో ఉండకూడదని, సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు.

బంగారం గొలుసు లాక్కెళ్లడంపై కేసు

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బంగారం గొలుసు లాక్కెళ్లడంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలో షేక్ మహబూబ్ జాన్, ఆమె చెల్లెలు రజియా బాను నివసిస్తున్నారు. గతనెల 20న రాత్రి రజియా బాను ఇంటిలో వంట గది వద్ద నిద్రిస్తోంది. గుర్తుతెలియని వ్యక్తి సుమారు రెండు గంటల సమయంలో రజియాబానును నిద్ర లేపి ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసును లాక్కొనేందుకు ప్రయ త్నించాడు. ఆమె గట్టిగా అరవగా అతడు గొలుసును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. అయితే సగం గొలుసు రజియా చేతిలో ఉండిపోయింది. అతడు లాక్కెళ్లిన గొలుసు ఐదు గ్రాములు ఉంటుంది. ఈ మేరకు బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి'

బత్తలపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలో గురువారం 'మీ సమస్య - మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, జక్కంపూటి సత్యనారాయణ, రమణ, మనోజ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ప్రజలకు

ఒక్కరోజు ముందే స్వాతంత్ర్యం

● ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రజలకు ఒకరోజు ముందే స్వాతంత్రం లభించిందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు మారెడ్డి లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి గెలుపొందడంపై పులివెందుల, ఒంటిమిట్ల ప్రజలకు అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా 40ఏళ్ళ తర్వాత పులివెందులలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఒక్కరోజు ముందే వారికి స్వా తంత్రం లభించిందన్నారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ ఫలితాల ద్వారా రాష్ట్రంలో నిరూపణ అయిందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పులివెందుల ప్రజలు తెలుగుదేశంపార్టీకి పట్టం కట్టారన్నారు. ప్రజాసామ్యయుతంగా జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు, గెలుపొందిన మారెడ్డి లతారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డికి, వారి గెలుపునకు కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

టీడీపీ గెలుపుపై హర్షం

కదిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు ప్రజా విజయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. 30యేళ్లుగా పులివెందలలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్నారు. ఈ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని ప్రజలకు టీడీపీ కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

సబ్‌జైలు ఖైదీ మృతిపై 18న ఆర్డీఓ విచారణ

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పామిడి మండలం దేవరపల్లికి చెందిన ఖైదీ కాడింటి కేశవనారాయణ అలియాస్ శివయ్య మృతిపై ఈ నెల 18న విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీఓ మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవనారాయణ(50) ధర్మవరం సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అనారోగ్యం కారణంగా వైద్యచికిత్సల కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది జనవరి 14న మృతిచెందాడు. అయితే జాతీయ మానవ హక్కుల కమిషన్ ఖైదీ మృతికిగల కారణాలను విచారించాలని ఆదేశించింది. దీంతో కలెక్టర్ ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌కు ఈనెల 18న విచారించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మృతిచెందిన ఖైదీ గురించి తెలిసిన సమాచారాన్ని, అఫిడవిట్ రూపంలో కానీ ప్రత్యక్షంగా కానీ తెలియజేయాలని ఆర్డీఓ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి



వీరారెడ్డి (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్లి గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. చిన్నూరు కాలనీవాసులు, బంధువులు తెలిపిన మేరకు..మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు చిన్నూరుకు చెందిన వీరారెడ్డి(38) వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవించేవాడు. పంటలు పండక, కుటుంబ జీవనం కోసం రూ.6లక్షల దాకా అప్పులు చేశాడు. వ్యవసాయంలో గిట్టుబాటు కాకపోవడంతో బండి బాడుగకు వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం ధర్మవరంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లి అక్కడ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. బంధువులు, కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య శాంతి, కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి, కుమార్తె స్నేహలత ఉన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి

ధర్మవరం/ధర్మవరం రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ, యశోద, రిషి పాఠశాలల్లో, మండలంలోని నాగలూరు వద్ద ఉన్న పీసీఎంఆర్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికలు, కుచేలుడు వేషధారణలో అలరించారు. అనంతరం చిన్నారులచేత ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుడి గొప్పతనం, లీలల గురించి విద్యార్థులకు ఆయా పాఠశాలల యాజమాన్యం వివరించారు.



కాకతీయ విద్యానికేతన్‌లో ఉట్టికొడుతున్న చిన్నారి



రిషి విద్యాలయంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



పీసీఎంఆర్ పాఠశాలలో...

ఘనంగా హర్ ఘర్ తిరంగా

● జాతీయ భావం పెంపొందించుకోవాలి: కలెక్టర్



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు జాతీయ భావం పెంపొందించుకోవాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో భాగంగా గురువారం సత్యసాయి సూపర్‌స్పెషలిటీ ఆసుపత్రి నుంచి వై జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. వైజంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. దేశభక్తి ఉట్టిపడేలా అందరిచేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ క్రిష్టప్ప, డీఏఓ సుబ్బారావు, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీపీఓ సమత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎం తదితరులు

● ధర్మవరం: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే ఎస్ఎం చల్లా నరసింహనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీఎఫ్, రైల్వే సిబ్బంది జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దేశ సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్ఎం పిలుపునిచ్చారు.



● తాడిమర్రి: మండలకేంద్రంలో గురువారం మండలస్థాయి అధికారులందరు కలిసి ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటుచేసి స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న దేశనాయకుల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ క్రిష్ణమోహన్, ఏఓ నాగేంద్రబాబు, ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



● ముదిగుబ్బ: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాఠశాల నుంచి కదిరి రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఎంపీపీ ఆదినారాయణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, బీజేపీనాయకులు పాల్గొన్నారు.



● అమడగూరు: మండలకేంద్రంలోని జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు, అధ్యాపకులు సూర్యప్రకాష్, సుధాకర్, రఘునాథ్‌రెడ్డి, యల్లప్ప, గంగన్న, నాగేంద్రరెడ్డి, షాన్వాజ్, జయరామ్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల అందజేత

పుట్టపర్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను టీడీపీ నాయకులు ఏడో వార్డు సచివాలయానికి అందజేశారు. టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జ్ ఉక్కలం శ్రీనివాసులు, మెప్మా అధ్యక్షురాలు పద్మావతి, గోపాల్‌నాయుడు, ధరణి గురువారం సచివాలయానికి ఫొటోలు అందజేశారు.

వ్యక్తికి విద్యుదాఘాతం

కదిరి అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నగారిపల్లిలో గురువారం ఓ వ్యక్తికి విద్యుదాఘాతమైంది. గ్రామానికి చెందిన గంగరాజు ఆటో వస్తువుల కోసం గురువారం మిద్దె పైకి ఎక్కాడు. అయితే మిద్దెపైన వెళుతున్న 11కేవీ వైర్లను పొరపాటున తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి

బుక్కపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముదుర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందచేశారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

● జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ ఇతర అధికారులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన జిల్లాలో వినాయక మండపాల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, పంచాయతీ, మున్సిపల్ శాఖాధికారులతో సమీక్షించారు. మట్టి వినాయకుల తయారీని ప్రోత్సహించాలన్నారు. పర్యావరణానికి హాని కలగని విధంగా వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోవాలని సూచించారు. అధికారులు కూడా పీస్ కమిటీలు ఏర్పాటు చేసి, పర్యవేక్షించాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా మట్టి విగ్రహాల తయారీ, నిమజ్జనం జరగాలన్నారు. అనంతరం మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అన్న పోస్టర్లును జేసీ అవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, వీవీఎస్‌శర్మ, డీపీఓ సమత, డీఎస్పీ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్లు క్రాంతికుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచక్రపూజ


పూజల్లో పాల్గొన్న భక్తులు

మడకశిర టౌన్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీషిర్డీ సాయినాథుడి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయంలో శ్రీచక్రపూజను నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేకపూజలతోపాటు పల్లకీ ప్రాకారోత్సవం నిర్వహించారు. షిరిడీసాయినాథుడికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

టీడీపీ సంబరాలు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడంతో టీడీపీ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు. బాణసంచా పేల్చారు. వైఎస్ జగన్ పతనం ప్రారంభమైందంటూ పేర్కొన్నారు.



హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కడపజిల్లా పులివెందుల వంటిమిట్టి జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలవడంపై ఎమ్మెల్యే కార్యాలయంవద్ద సంబరాలు జరుపుకున్నారు. హిందూపురం పట్టణ అధ్యక్షులు వెంకటేష్, రూరల్ మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో టపాసులుపేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే పులివెందులలో ఎప్పుడూ తెలుగుదేశం పార్టీనే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, బేవనహళ్లి ఆనంద్, శివశంకర్, మంగేష్, చెన్నమ్మ, శ్రీదేవి, రామాంజినమ్మ, అబి, చంద్రమోహన్, ఇర్షాద్, భార్గవ్, పవన్ పాల్గొన్నారు.



రొద్దం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రొద్దంలో పావగడ సర్కిల్, రొద్దం బస్టాండులో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, రామచంద్ర, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి పవన్, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, చంద్రశేఖర్, సిద్దన్న, నాగ, రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నాయకులు సంబరాలు జరిపారు. కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి బస్టాండ్ ప్రాంతంలో బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నరేష్‌యాదవ్, అజుము, గిరి, ఉమ్మర్‌ఖాన్, శ్రీనివాసులు ఉన్నారు.



సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ పతనం ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులు, సిద్దలింగప్ప, కిష్టప్ప, సూర్యనారాయణ, పూజారిశంకర తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని స్థానిక బస్టాండు ఆవరణంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ యువత ఉపాధ్యక్షుడు కెఎన్ఎం శివకుమార్‌యాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ దాదాపీర్, నాయకులు మారుతిప్రసాద్ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.



రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్ట టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. జగన్ అడ్డాపై టీడీపీ జెండా ఎగురడంతో వైసీపీ పతనం ఆరంభమైందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బీఎన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జీకే ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలం చెల్లిన బస్సులే గతి

నేటికీ అందుబాటులో 33 సర్వీసులే..
80 గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు
సర్వీసులు పెంచాలని మహిళల డిమాండ్

మడకశిర టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన మడకశిరకు ఆర్టీసీ డిపో మంజూరైతే ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో 2009లో మడకశిర డిపోను కేవలం 6 బస్సు సర్వీసులతో ప్రారంభించారు. 16 సంవత్సరాలు కావస్తున్నా నేటికి 33 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అందులో ఎక్స్‌ప్రెస్‌లు, లగ్జరీ మినహా మిగత సగం బస్సులు కాలం చెల్లినవే. తరచూ మొరాయిస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద డిపోలలో కాలం చెల్లిన బస్సులకు మరమ్మతులు చేయించి మడకశిర డిపోకు పంపుతున్నారన్న ఆరోపణలు ప్రయాణికుల నుంచి సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మడకశిర డిపో నుంచి హిందూపురం, అనంతపురం, కర్నూలు, పెనుకొండ, అమరాపురం, గుడిబండ, కర్ణాటక ప్రాంతం శిరకు బస్సులు తిరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీశైలంకు-2 బస్సులు, విజయవాడ, తిరుపతి, కర్నూలుకు కొత్త బస్సులు నడుపుతుండటంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కొంత మేరకు ప్రయోజనం చేకూరుతోంది. మొత్తం మీద 7 ఎక్స్‌ప్రెస్, 4 హైటెక్, 22 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంవత్సరాల నుంచి నడుస్తున్న సర్వీసులును రద్దు చేశారు. దీంతో ఆ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు లేక ఆటో, ఇతర వాహనాలే దిక్కుగా మారాయి. ఎం.రాయపురం, అగళి-కదిరి, అగళి-పావగడ, రొళ్ల-పావగడ, కర్ణాటక రాష్ట్రం వెళ్లే మూడు సర్వీసులు, ఆలూడి మీద వెళ్లే బస్సులు రద్దు చేశారు. ఆ సర్వీసులు నిలపడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 80 గ్రామాలకుపైగా నేటికీ బస్సు సర్వీసులు లేవు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి మడకశిర డిపోకు కొత్త బస్సులు మంజూరు చేసి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.


మొరాయించిన బస్సును నెట్టుతున్న ప్రయాణికులు(ఫైల్)

సర్వీసులు పెంచాలి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంచదగ్గ విషయం. అయితే గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపకపోతే ప్రభుత్వ పథక ఉద్దేశం నీరుగారుతుంది. స్త్రీశక్తి పథకం వల్ల ఎంతో మంది పేద మహిళలకు ఉచిత ప్రయాణం ఎంతో అనుకూలం. అయితే ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు మరిన్ని ఆర్టీసీ బస్సులు నడపేందుకు చర్యలు తీసుకోవాలి. ఎస్.రాయపురం గ్రామానికి ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు సౌకర్యం ఉంటోంది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పెడుతున్న నేపథ్యంలో సర్వీసులను పెంచాలి.

-భాగ్యమ్మ, ఎస్ రాయపురం

కొండల మధ్య ఉన్నాం..



రొళ్ల మండల పరిధిలోని టీ.డీ.పల్లి గ్రామం కొండ ప్రాంతాల మధ్య ఉంది. గతంలో ఒక్క ఆర్టీసీ బస్సు మాత్రం ఒక్కసారి వచ్చి వెళ్లేది. ఉన్న ఒక్క ఆర్టీసీ బస్సు కూడా రద్దు చేశారు. అటవీప్రాంతం కావడం వల్ల కాలినడకన కొండల మధ్య 5 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారినా మా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైన మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

-లక్కమ్మ, టీడీ పల్లి, రొళ్ల మండలం

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

స్త్రీశక్తి పథకాన్ని మడకశిరలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగణంగా అన్ని చర్యలు తీసుకున్నాం. మడకశిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు, కొత్త ఆర్టీసీ బస్సుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి బస్సులు కేటాయిస్తే అన్ని రూట్లకు బస్సులు నడిపి ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం.

-రంగభాష్యం, డిపో మేనేజర్

మేము సైతం..

స్వాతంత్ర్య పోరాటంలో పెనుకొండ ప్రజలు


పంచాంగం శేషశయనం

పెనుకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిలో పెనుకొండకు చెందిన వారు ఉండటం జిల్లాకే గర్వకారణం. అందులో ప్రముఖులు పంచాంగం శేషశయనం, చిదంబర రెడ్డి, కురాకుల రామచంద్రయ్య, నారాయణరెడ్డి, లక్ష్మీనరసప్ప, చిక్కిరెడ్డి తదితరులు ఉన్నారు. వీరు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బరావు స్ఫూర్తితో చిన్నవయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా పెనుకొండలోని డీఈఓ కార్యాలయంగా ఉన్న గగన్మహల్‌ను ముట్టడించి అందులోని రికార్డులకు నిప్పుపెట్టారు. దీంతో బ్రిటిష్ పోలీసులు వీరిని అరెస్ట్ చేసి ఏడాది పాటు వివిధ జైళ్లలో పెట్టి ఇబ్బంది పెట్టారు. వీరి పోరాట స్ఫూర్తికి గుర్తుగా రూపొందించిన శిలాఫలకం నేటికి పెనుకొండలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఉంది. పెనుకొండకు చెందిన పంచాంగం శేషశయనం జైలులో ఉండగా ఆయనకు కుమార్తె జన్మించింది. ఆమెకు స్వరాజ్యం అనే పేరు పెట్టి తనకున్న దేశ భక్తిని చాటుకున్నారు. 2023లో కేంద్ర ప్రభుత్వం ఆజాది కా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా శేషశయనం కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి
మార్కెట్ కమిటీ డైరెక్టర్లు

గోరంట్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దేవాంగం శ్రీనివాసులు, రవీంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం టీడీపీ కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెటయార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

'పార్టీకి విధేయుడిగా ఉంటా'


మంత్రిని సన్మానిస్తున్న వెంకటరమణ

పెనుకొండ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పార్టీకి విధేయుడిగా ఉంటానని నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ అన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ పదవి అప్పగించినందుకు గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో మంత్రి సవితను కలిసి సన్మానం చేశారు.

రాజన్నను మంత్రి వర్గంలో కొనసాగించాలి
ర్యాలీలో వాల్మీకి సంఘం నాయకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పావగడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాజన్నను యథావిధిగా మంత్రిపదవిలో కొనసాగించాలని కోరుతూ పట్టణంలో గురువారం పెద్దఎత్తున వాల్మీకి సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. బడుగు, బలహీనవర్గాలకు ఎంతో సేవ చేసిన రాజన్నను మంత్రి పదవి నుంచి తొలగించడం దారుణమని వారు అన్నారు. తిరిగి మంత్రి పదవి ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వాల్మీకి సంఘ నాయకులు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోండి: సీడీపీఓ

మడకశిర రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పిల్లల పౌష్టికాహారంపట్ల తగుజాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి.. అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం మండలంలోని కదిరేపల్లి, కంబాలపల్లి, కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు ఆదేశాలు జారీ చేశారు.

రూ.1.5 కోట్లతో గుడ్డం కోనేరు అభివృద్ధి
-మున్సిపల్ చైర్మన్ రమేష్


గుడ్డం కోనేరు వద్ద పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరును అహుడా నిధుల కింద రూ.1.50కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. ఈ పనులకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేయనున్నారు. గురువారం చైర్మన్, కమిషనర్ మల్లికార్జున గుడ్డం కోనేరును పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే బాలకృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఎంజీఎం క్రీడా మైదానంలో జరిగే వేడుకల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొని జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లతో సమీక్ష జరుపుతారు. సాయంత్రం స్త్రీశక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సును ప్రారంభిస్తారు.

'అఖండ భారత్‌ను సాధిస్తాం'


ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో గురువారం రాత్రి విశ్వహిందూపరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో అఖండభారత సంకల్ప దివాస్ పేరుతో కాగడా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు మాట్లాడుతూ అఖండ భారత్‌ను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆదర్శ్, రమేష్‌రెడ్డి, చలపతి, భాగ్యమ్మ, నాగరాజు, అనిత, శేఖర్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అగళి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా ర్యాలీని గురువారం అగళిలో కూటమి నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌యాదవ్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, మాజీ ఎంపీపీ నరసింహప్ప, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డరంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకాలు రెపరెపలాడాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి త్రివర్ణ శోభ

లేపాక్షి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం త్రివర్ణ పతాక రంగులతో విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.



పేద పిల్లలు విద్యావేత్తలుగా ఎదగాలి
ఎమ్మెల్యే బాలకృష్ణ


వసతి గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):పేద పిల్లలు విద్యావేత్తలుగా ఎదగాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆకాంక్షించారు. గురువారం ఆయన మండలంలోని టేకులోడు మహాత్మ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతి గృహాలు, ల్యాబ్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు గురుకులాలను ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు విద్యాదానం చేశారన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. పాఠశాలకు ఇప్పటికే ప్రహరీ నిర్మాణం చేపట్టామన్నారు. వసతి గృహ భవనాలు పూర్తి చేశామన్నారు. ల్యాబ్‌లను సైతం ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ల్యాబ్, వసతి గృహాలను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకి పార్టీ నాయకులు, కార్యకర్తలు.. బాగేపల్లి టోల్‌గేటు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, రంగారెడ్డి, నాగరాజుయాదవ్, అశ్వత్థప్ప, నందీషప్ప, నంజుండప్ప, శ్రీదేవి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన సాదుచెట్టి సంఘం నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వీరికి కండువావేసి పార్టీలో ఆహ్వానించారు. చేరిన వారిలో శ్రీధర్, రాజు, సునీల్, లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు. వీరు పట్టణంలో ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే కార్యాలయం వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి: సీఎం

రొద్దం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో భావితరాల బంగారు భవిష్యత్తుకోసం జిల్లా కలెక్టర్లు చెరువుల అభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. గురువారం రొద్దం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చెరువు సంఘం అధ్యక్షులు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. చెరువుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అందుకు అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, 30 చెరువుల సాగునీటిసంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ భార్గవ్ నేతృత్వంలో చెరువు ఆయకట్టు అధ్యక్షులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువుల అభివృద్ధికి కృషిచేయాలని సీఎం సూచించారు.

స్త్రీశక్తిని ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి మడకశిరలో సాయంత్రం 5 గంటలకు జ్యోతిబాపూలే సర్కిల్‌లో ప్రారంభించనున్నట్లు పట్టణ అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఉదయం 7.45 గంటలకు క్యాంపు కార్యాలయంలో, 8 గంటలకు బాలాజీ నగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయం ఆవరణలో జాతీయజెండాను ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

'ఈ క్రాప్ తప్పనిసరి'

మడకశిర రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్లు కావలసిన రైతులు తప్పనిసారిగా సాగుచేసిన పంటలు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏపీ ఎంఐపి డివిజన్ అధికారి నరసింహప్ప తెలిపారు. గురువారం కల్లుమర్రి, మణూరు గ్రామాల రైతులు ఏర్పాటు చేసుకున్నా డ్రిప్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ, హార్టికల్చర్, సిరికల్చర్ సిబ్బంది, ఎంపీఈఓలు విధిగా రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాంటి రైతులకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లరు పంపిణీ యడం జరుగుతుందన్నారు.

'జగన్ క్షమాపణ చెప్పాలి'

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీని విమర్శించిన జగన్మోహన్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సొంతూరైన పులివెందులలో నీ సత్తా ఏమిటో తేలిపోయిందన్నారు. నీకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీని, రాహుల్‌గాంధీని విమర్శించడం నీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంటే వాటిని కాపాడటానికి అలుపెరుగని పోరాటం రాహుల్ గాంధీ చేస్తున్నారన్నారు. బీజేపీ పట్ల మీ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఉత్తర్వులు సరికాదు: ఎస్ఎఫ్ఐ

పెనుకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించకూడదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద సర్క్యులర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రవణ్, అనీల్ పాల్గొన్నారు.

20న స్పాట్ అడ్మిషన్లు

మడకశిర రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బయన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావలన్నారు. వివరాల కోసం ఉద్యాన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌నుగాని, ప్రిన్సిపాల్ సెల్ నెంబర్ 7382633687ను సంప్రదించాలన్నారు.

'శ్మశాన వాటికను శుభ్రం చేయించండి'

పావగడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎంసీ మార్కెట్‌యార్డ్‌కు పక్కనే ఉన్న శ్మశాన వాటికను శుభ్రం చేయాలని ఆరవ వార్డు సభ్యుడు గుట్టహళ్లి అంజప్ప మున్సిపల్ అధికారులకు విన్నవించారు. శ్మశానవాటికలో కంపచెట్లు పెరిగిపోయాయన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు సుదేష్‌బాబు చొరవ తీసుకుని కంపచెట్లు తొలగించాలని కోరారు.

కారు ఢీకొని విద్యార్థికి గాయాలు

గోరంట్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఇటుకల పరిశ్రమ వద్ద గురువారం కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో విద్యార్థి గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మోటార్‌పల్లికి చెందిన గంగరాజు ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవసంవత్సరం చదువుతున్నాడు. కళాశాల అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఇటుకల పరిశ్రమ మలుపు వద్ద హిందూపురం నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తలకు, ఎడమచేతికి, శరీరంపై తీవ్రగాయాలయ్యాయి. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌ఉషా చికిత్సలుచేసి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.